క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా

నందలూరు(రాజంపేట) : నందలూరు మండల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మధ్యాహ్నం 2.30 గంటలకు వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఏపీఎం వసుంధర తెలిపారు. కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీపీ విజయభాస్కర్ రెడ్డిలు పాల్గొంటారన్నారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ మహిళా సభ్యులు తప్పక హాజరుకావాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజంపేట రూరల్ : డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం తెలియజేశారు. రాజంపేటలోని 220 కెవిఎస్ఎస్, పుల్లంపేట, పెనగలూరు మండల పరిధిలోని 33 కెవి, 11 కెవి, విద్యుత్ లైన్లకు సమీపంలో ఉన్నటువంటి చెట్లు తొలగించే కార్యక్రమం శనివారం చేపట్టామన్నారు. పట్టణ ప్రాంతమైన రాజంపేటతో పాటు మండలంలోని తాళ్లపాక, ఆకేపాడు, బ్రాహ్మణపల్లి, మందరం, హెచ్.చెర్లోపల్లి, కొండ్లోపల్లి, కట్టకిందపల్లి, పుల్లంపేట మండలంలోని పీవీజీ పల్లి, దొండ్లోపల్లి, వత్తలూరు, రెడ్డిపల్లి, బావికాడపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలియజేశారు.

చిట్వేలి మండలంలో..

చిట్వేలి : మండల పరిధిలోని చిట్వేలి, భాకరాపురం, కస్తూరివారిపల్లి, పత్తిగుంటవారిపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చిట్వేలి ట్రాన్స్‌కో ఏఈ వెంకటాచలపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ మేరకు రెండో శనివారం సందర్భంగా రాజంపేట 220 కేవీ మరమ్మతుల కారణంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

పెనగలూరు మండలంలో..

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలో నేడు శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ షఫీ తెలిపారు. మండలంలోని బెస్తపల్లి, పెనగలూరు, కొండూరు, తిమ్మయ్యగారిపల్లె సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆస్తి కార్డుల పంపిణీ



కార్డులను లబ్ధిదారులకు ఇస్తున్న సర్పంచ్ ముసల్‌రెడ్డి

చిన్నమండెం : వండాడి గ్రామ పంచాయతీలో స్వామిత్వా పథకం కింద శుక్రవారం ఆస్తి కార్డులను సర్పంచ్ ముసల్‌రెడ్డితో కలిసి పంపిణీ చేసినట్లు ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు తమ ఇళ్లను సొంతం చేసుకునే హక్కు చట్టపరమైన పత్రం ఉంటుందన్నారు. లబ్ధిదారులకు, వారి ఇళ్లకు సంబంధించిన చట్టబద్ధమైన పత్రాలను అందజేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి ఆస్తి కార్డులను త్వరలోను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సుమిత్రమ్మ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విరాళాలు ఉదార స్వభావానికి నిదర్శనం



నిర్మించిన బెంచీల వద్ద దాతలు, జడ్జి శంకర్

రాజంపేట రూరల్ : ధార్మిక సంస్థలకు విరాళాలు ఇచ్చి దేవాలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించడం దాతల ఉదార స్వభావానికి నిదర్శనమని స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ కొనియాడారు. మండల పరిధిలోని గుండ్లూరు సమీపంలో బహుదానది ఒడ్డున ఉన్న పురాతన శైవ క్షేత్రం శ్రీ అగస్త్యేశ్వర దేవాలయానికి శుక్రవారం కేంద్ర పురావస్తు శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి చెంగారి రామాంజనేయులు తన తల్లిదండ్రులు, సతీమణి జ్ఞాపకార్థం సిమెంట్ బెంచీల వితరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జడ్జి డాక్టర్ పసుపులేటి శంకర్, విశ్రాంత ఉద్యోగి బాలాజీరావు, విశ్రాంత తహశీల్దారు నాయనపల్లి జయన్న, రామాంజనేయులుతో కలిసి ఆలయ ప్రధాన అర్చకులు శివయ్యకు వితరణ చేశారు. కార్యక్రమంలో పురోహితుడు గంగాధర్, రామాంజనేయులు కుమారుడు చెంగారి సాయిగౌతమ్, మనవరాలు చెంగారి కుందన తదితరులు పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి సదుం సమీపంలో ఎస్‌ఐ రవీంద్రబాబు సిబ్బందితో కలసి శుక్రవారం నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో టి సదుంకు చెందిన కార్తీక్ (29) అనే వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నుంచి బస్సులో 48 మద్యం ప్యాకెట్లను తరలిస్తూ పట్టుబడగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు. అక్రమంగా మద్యం తరలిస్తే కఠినంగా వ్యవహరిస్తామని తెలియజేశారు.

నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం

- జాతీయ నులిపురుగుల దినోత్సవం
- విద్యార్థులతో మాత్రలను వేయించిన వైద్యులు
- పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచన



రాయచోటి అర్బన్: మాత్రలను మింగిస్తున్న వైద్యసిబ్బంది



గాలివీడు: మాత్రలను వేస్తున్న వైద్యులు స్రవంతిరెడ్డి

సంబేపల్లె : పిల్లల ఎదుగుదలకు నులిపురుగులు ప్రమాదకరమని, నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని దుద్యాల గ్రామం, పెద్దజంగంపల్లె జిల్లా పరిషత్ పాఠశాలలో డీవార్మింగ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్బెండజల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ నులిపురుగులు శరీరంలో ఉండడం వలన రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం వంటి రుగ్మతలకు లోనవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహారపదార్థాలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రతను పాటించాలన్నారు. 1 నుండి 5 సంవత్సరాల పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలలో 6 నుంచి 19 సంవత్సరాల వారికి పాఠశాలలలో ఈ నులిపురుగుల మాత్రలను అందజేశామన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చక్రపాణి, ఆరోగ్య కార్యకర్త రవిశంకర్, ఎంఎల్‌హెచ్‌పి షబ్రీన్, ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయచోటిలో..

రాయచోటి టౌన్ : నులిపురుగు వలన మనం అనారోగ్యపాలవుతామని రాయచోటి పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నులిపురుగులు ఎలా ఉద్భవిస్తాయి అవి శరీరంలోకి ఎలా ప్రవేశిస్తాయి. శరీరంలో ఎలాంటి హాని కలిగిస్తాయన్ని ప్రొజెక్టర్ ద్వారా వీడియోను ప్రదర్శించారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా ప్రభుత్వం అందిస్తున్న అల్బెండజోల్ అనే మాత్రలను తీసుకోవడం వలన మనం నులిపురుగును ఎలా నిర్మూలించవచ్చునే విషయాన్ని కూడా వివరించి చెప్పారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాగ సురేంద్రారెడ్డి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం



సంబేపల్లె: విద్యార్థికి నులిపురుగుల మందును వేస్తున్న వైద్యాధికారి సూర్యనారాయణ రెడ్డి



రాయచోటి టౌన్: పోస్టర్లను విడుదుల చేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

రాయచోటి అర్బన్ : ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని యండపల్లె పీహెచ్‌సీ ఆరోగ్యకేంద్రం ఫ్యామిలీ డాక్టర్ పోగ్రాం కో-ఆర్డినేటర్ వై.విశ్వనాథరెడ్డి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యండపల్లె పీహెచ్‌సీ వైద్యసిబ్బంది శుక్రవారం మధ్యాహ్నం మాధవరం జెడ్పీ హైస్కూల్‌తోపాటు అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు చేతులను కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శుభ్రమైన ఆహారాన్ని స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూల వెంకటరమణ, జమాల్‌బీ, వెంకట్రామయ్య, ఎ.కె.మస్తాన్, రమణయ్యనాయక్, వెంకటరమణ, నాగరాజనాయక్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలివీడులో..

గాలివీడు : నులిపురుగులను నిర్మూలించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మధుసూధన్ పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే చదువుపై ధ్యాస ఉంటుందని, నులిపురుగుల నిర్మూలన, నివారణ కోసం డీఈసీ అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలని విద్యార్థులను ఆరోగ్యంగా ఉంచుకుందామని పిలుపునిచ్చారు. మండలంలోని 3,122 మంది విద్యార్థులకు గాను 2,998 మందికి నులిపురుగుల మాత్రలను అందించామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు స్రవంతిరెడ్డి, శంకర్ నాయక్, హెల్త్ సూపర్‌వైజరు దేవేంద్రరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశాలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ



కార్యదర్శులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలోని పలు సచివాలయాలను శుక్రవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా సచివాలయాల పరిధిలోని పక్కా గృహాల నిర్మాణాలు, సంక్షేమ పథకాలు అమలు తీరుపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల్లో జగనన్న కాలనీల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను సక్రమంగా, వేగవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ క్రిష్ణారెడ్డి, ఆర్ఐ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు రాజ్యాధికారం కావాలి

రాయచోటి టౌన్ : దివ్యాంగులకు రాజ్యాధికారం కల్పించాలని ఆ దిశగా అందరం కలసికట్టుగా పని చేయాలని రాష్ట్ర భారత్ దివ్యాంగ పార్టీ ఉపాధ్యక్షులు వెంకటరామరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు (శనివారం) అన్నమయ్య జిల్లా కేంద్రంలోని నేడు డైట్ కేంద్రంలో దివ్యాంగుల ఎన్నికలు నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా స్థాయి కమిటీని నిర్వహించి నూతన కమిటీని ఎనుకోనున్నట్లు తెలిపారు. అందుకు జిల్లా స్థాయిలోని దివ్యాంగులు అందరూ హాజరుకావాలని కోరారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి



మాట్లాడుతున్న ఎలక్టోరల్ అధికారి లీలారాణి

రైల్వేకోడూరు : ఎన్నికల నియమావళిని పగడ్బందీగా అమలు చేయాలని కోడూరు ఎలక్టోరల్ అధికారి లీలారాణి తెలిపారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం పైన ఎన్నికల అధికారులు, పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వర్తించే అధికారులు, బీఎల్‌ఓలు నిబంధనలు పాటించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలలో ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందు నుంచే చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టుల్లో వాహనాల తనిఖీలకు వాహనదారులు సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణ నిబద్ధతగా చేపడదామని తెలియజేశారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. పోలీసులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. అనంతరం పలు అంశాలపై అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో రాజంపేట డీఎస్పీ చైతన్య, రైల్వేకోడూరు సీఐలు మధుసూదన్‌రెడ్డి, టి.బాబులు, డిప్యూటీ తహసీల్దార్లు అమరేశ్వరి, సిద్దు, ఎస్‌ఐ నాయక్, ఐదు మండలాల ఎస్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

భద్రకాళికి రాహుకాల పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. అలాగే నిమ్మకాయల హారాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి హారతులు పట్టారు. భక్తులకు రాహుకాల పూజ విశేషాలను, విశిష్టతలను వివరించి చెప్పడంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

పాదయాత్ర పుణ్యఫలం



గండ్ర దంపతులను సన్మానిస్తున్న ఆకేపాటి

రాజంపేట రూరల్ : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం పాదయాత్ర చేపట్టడం పుణ్యఫలమని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలోని భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ గండ్ర జ్యోతి, మాజీ శాసనసభ్యులు గండ్ర వెంకటరమణారెడ్డిలు తమ భక్త బృందంతో తిరుమల మహా పాదయాత్ర చేపట్టారు. ఈ పాదయాత్ర మండల పరిధిలోని భక్త కన్నప్ప జన్మ స్థలమైన ఊటుకూరు గ్రామం వద్దకు శుక్రవారం చేరుకోగానే గండ్ర దంపతులను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి జెడ్పీ చైర్మన్ ఆకేపాటి సన్మానించారు. అనంతరం పాదయాత్రలో అడుగులు కలిపారు. ఆకేపాటి వెంట మార్కెట్ యార్డ్ చైర్మన్ పోలి మురళీరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లబోతుల ఈశ్వరయ్య, రేవరాజు శ్రీనివాసరాజు, పాపినేని విశ్వనాథరెడ్డి, దాసరి పెంచలయ్య, కుమార్‌రెడ్డి, ఎ.అమర తదితరులు పాల్గొన్నారు.

'డ్వాక్రా సంఘాల అభివృద్ధిలో అగ్రస్థానం'



మాట్లాడుతున్న ఏపీఎం దేవసేన

రామాపురం : అన్నమయ్య జిల్లాలో రామాపురం మండలం డ్వాక్రా సంఘాలు 90శాతం అభివృద్ధితో అగ్రస్థానంలో నిలిచిందని వెలుగు ఏపీఎం దేవసేన పేర్కొన్నారు. శుక్రవారం మాట్లాడుతూ తాను రాకముందు సంఘాలు బలహీనంగా ఉన్నాయని, రామాపురం వచ్చాక మరింత అభివృద్ధిలో నడిపించానని పేర్కొన్నారు. మండలంలో 740 సంఘాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఆసరా కింద అన్ని గ్రూపులకు రూ.13.13కోట్లు శ్రీ నిధి కింద 258 గ్రూపులకు రూ.6.25కోట్లు, ఎస్సీ, ఎస్టీ పథకం కింద 31 సంఘాలకు రూ.4.75కోట్లు జగనన్న తోడు కింద 235 సంఘాలకు రూ.2.35లక్షలు, బ్యాంకు రుణాలు 592 గ్రూపులకు రూ.34.15కోట్లు, టార్గెట్ రూ.18 కోట్లు ఉండేవి ఈ ఏడాది పెరిగిందన్నారు. చేయూత జీవనోపాధి కింద 109 గ్రూపులకు రూ.1.9కోట్లు మండలంలో ప్రస్తుతం 10 పాల కేంద్రాలు ఏర్పాటు కాగా మళ్లీ కొత్తగా 10 పాల కేంద్రాలు పెరిగాయన్నారు. పాల కేంద్రంలో ఉండే రైతులకు ఒక్కొక్కరికి రూ.1000లు చొప్పున ఖాతాలో జమ చేయడం జరిగిందన్నారు. 15 రోజులకు ఒకసారి పాల బిలుల రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. అన్ని రంగాలలో మహిళలకే ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు

సంబేపల్లె : విద్యార్థులు చిన్ననాటి నుంచి ఇతరులతో పోటీపడి చదివినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థుల కోసం తయారు చేసిన మోడల్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజ్ఞా వికాస పరీక్షను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పదోతరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడానికి పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధం కావాలో తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ సర్వేపల్లి మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎక్కువ కావడం వల్ల ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గడం ఆందోళన కల్గిస్తుందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రైవేటు, కార్పొరేట్ కంటే మెరుగైన వసతులు సమకూర్చారన్నారు. నాణ్యమైన విద్య కోసం విద్యార్థులందరూ ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి శెట్టిపల్లి సాయికుమార్, ఉపాధ్యాయులు రవిశంకర్, విజయసారథి రెడ్డి, శంకరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనుద్దీన్‌కు పురస్కారం



రాయచోటి టౌన్ : రాయచోటి నియోజకవర్గ పరిధిలోనే కాకుండా వివిధ ప్రాంతాలలో రక్తదానం, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకుగానూ హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ డాక్టర్ మైనుద్దీన్‌కు ఇండియన్ అచీవర్ అవార్డు అందుకున్నారు. గురువారం తెలంగాణ రాష్ట్రంలోని రవీంద్రభారతిలో అల్లూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ వారు ఇండియన్ అచీవర్ అవార్డును అందజేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే 'పల్లెకు పోదాం'



చిన్నమండెం: కార్యక్రమంలో పాల్గొన్న సాయిలోకేష్

నందలూరు(రాజంపేట) : మండలంలోని కుంపిణీపురం, మదనమోహనపురం, పొత్తపి గ్రామాలలో పల్లెకు పోదాం (గావ్ ఛలో అభియాన్) కార్యక్రమం శుక్రవారం నిర్వహించినట్లు బీజేపీ రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ పేర్కొన్నారు. రాజంపేట పార్లమెంట్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ చంద్రమౌళి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ పార్టీ దేశంలోని నలుమూలల ఉన్న పల్లెల్లో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ప్రతి పల్లెలో బీజేపీ నాయకులు 24 గంటలపాటు గడిపి అక్కడి స్థానిక సమస్యలు, స్థితిగతులను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ రాజు, విబిఎస్‌వై జిల్లా కో - ఆర్డినేటర్ ఆదినారాయణ, మండల యువ మోర్చా అధ్యక్షులు చుక్కా శ్రీనివాసులు, బీజేపీ మండల కార్యదర్శి మురళీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ పాలన ఆదర్శం

చిన్నమండెం : ప్రధాని నరేంద్రమోదీ పాలన ప్రపంచ దేశాలకు ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిలోకేష్ అన్నారు. మండలంలోని పడమటి కోన కస్పా గ్రామంలో శుక్రవారం పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకులు గడప గడపకు తిరిగి నరేంద్ర మోదీ పాలన తొమ్మిదిన్నర సంవత్సరాలలో దేశంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పుల్లమనాయుడు, వెంకటరమణనాయుడు, బాబునాయుడు, తిరుపతినాయుడు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజంపేటలో ర్యాలీ

రాజంపేట టౌన్ : దేశంలో జరిగే ఏ ఎన్నికలనైనా ఈవీఎంలతో కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని అల్ - బాదర్ మసీదు అధ్యక్షుడు గడికోట గుల్జార్‌బాషా డిమాండ్ చేశారు. బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలను నిర్వహించాలన్న డిమాండ్‌తో గత కొన్ని రోజులుగా సుప్రీం కోర్టు న్యాయవాదులు ఢిల్లీలో చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు స్థానికంగా ముస్లిం మైనార్టీలు సంఘీభావంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గుల్జార్‌బాషా మాట్లాడుతూ ఈవీఎంలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయన్నారు. అందువల్ల ఎన్నికల కమిషన్ రానున్న సార్వత్రిక ఎన్నికలను బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నజీర్‌బాషా, జాహిద్‌అలీ, షేక్ అన్వర్, చాంద్ బాషా, మసూద్, ఎస్.అల్తాఫ్, యాసిన్, అల్లాబకాష, కమాల్, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికలు బ్యాలెట్ పేపర్‌తోనే జరపాలంటూ ర్యాలీ తీస్తున్న ముస్లిం మైనార్టీలు

భజన చెక్కలు పంపిణీ

రాయచోటి అర్బన్ : లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కె.వి.పల్లె మోడల్ హైస్కూల్ ఉపాధ్యాయుడు గురుస్వామికి భజన చెక్కలు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వ్యవస్థాపక అధ్యక్షుడు హరినాథరెడ్డి మాట్లాడుతూ మన సంస్కృతి, కళలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పిల్లలకు చిన్నతనం నుంచే చెక్కభజన నేర్పించేందుకు భజన చెక్కలు అందచేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నారాయణరెడ్డి, మహమ్మద్, చాన్‌బాషా, కోశాధికారి హరీష్‌చంద్ర, కిషోర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుదలకు 'లిప్'



విద్యార్థులతో మాట్లాడుతున్న ఉపేంద్రారెడ్డి

సంబేపల్లె : విద్యార్థులలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు, కనీస సౌకర్యాల సాధనకు అభ్యసనాభివృద్ధి కార్యక్రమానికి (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం - లిప్) చేపట్టినట్లు రాష్ట్ర పరిశీలకులు ఉపేంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు శంకరయ్య చేస్తున్న మాదిరి పాఠ్య బోధనను గమనించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి, సామర్థ్యాలపై పలు ప్రశ్నలు వేశారు. విద్యార్థుల సమాధానాలతో సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి లైబ్రరీ నుంచి పుస్తకాలు తీసుకొని చదవాలన్నారు. చదివే అలవాటు పెంపొందడం వలన సబ్జెక్టు వారీగా సామర్థ్యాలు అభివృద్ధి చెందుతాయని సూచించారు. అనంతరం ఉపాధ్యాయుల సమావేశాన్ని ఏర్పాటు చేసి అభ్యసనాభివృద్ధిపై పలు సూచనలు చేశారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన ఉండాలన్నారు. సబ్జెక్టుల వారిగా నిర్దేశించిన సామర్థ్యాలను పరీక్షించి పిల్లల ప్రగతిని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నెలవారీ సమీక్షా సమావేశంలో పిల్లల ప్రగతిపై చర్చించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, ఏఎంఓ రామకృష్ణ, అసిస్టెంట్ ఏఎంఓలు రామాంజుల్ రెడ్డి, షమీవుల్లా, డిస్ట్రిక్ కో-ఆర్డినేటర్ రెడ్డయ్య, ఎంఈఓలు బాలాజీ నాయక్, రమాదేవి, శ్రీనివాసులు, లిప్ ఆర్పీలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతకు బీజేపీ ఏమి చేసిందో చెప్పాలి?

రాయచోటి అర్బన్ : తమ 10 సంవత్సరాల పరిపాలనలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశంలోని యువతకు ఏం చేసిందో చెప్పాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో ఏఐఎస్ఏ జిల్లా సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న యంగ్ ఇండియా రెఫరెండం కార్యక్రమం 3వ రోజైన శుక్రవారం కూడా సాగింది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై జాతీయస్థాయిలో అన్ని యూనివర్శిటీలలో యంగ్ ఇండియా రెఫరెండం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీజేపీ 10 సంవత్సరాల పాలన పుణ్యమా అని దేశంలో వివిధ ప్రభుత్వ శాఖలలో 30 లక్షల ఉద్యోగ నియామకాలు జరుగకుండా ఖాళీగా ఉన్నాయన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ఇప్పటికైనా మేల్కొని రాబోయే ఎన్నికల్లో గారడీల బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలంటూ కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ రాయచోటి ఏరియా నేతలు రెడ్డిమహేష్, సంతోష్, నిరంజన్, దర్బార్, మహమ్మద్ తదితర విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న డివిజన్ మాస్టర్ ట్రైనర్ మధుకర్

రామాపురం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసుకోవడంతో అధిక దిగుబడి సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ అధికారి డివిజన్ మాస్టర్ ట్రైనర్ మధుకర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో గ్రామస్థాయి అధికారుల సమావేశంలో మాట్లాడుతూ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని, రసాయన ఎరువులు, మందులు వాడకం తగ్గించి ప్రకృతి రసాయలను వాడడంతో పంటలు బాగా పండుతాయన్నారు. అనంతరం ఏడీఏ జయరాం మాట్లాడుతూ గ్రామాల్లో నియమించిన ప్రకృతి వ్యవసాయ అధికారుల ఆ గ్రామల పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మండల సహకార సంఘం అధ్యక్షుడు పెద్దరెడ్డి, నాగమణిలు ప్రకృతి వ్యవసాయంపై ప్రసంగించారు.

రోడ్డును అన్యాక్రాంతం చేయడం తగదు!

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లి గ్రామ పంచాయతీ వడ్డివారిపల్లి గ్రామం నుంచి కలవాని కుంట వరకు ఉన్న పబ్లిక్ రోడ్డును కుప్పాల సరిత అన్యాక్రాంతం చేశారంటూ గ్రామస్తులు శుక్రవారం సిద్దవటం తహసీల్దారు మురాద్ షావలికి వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. తహసీల్దారుకు అందజేసిన పత్రంలో వివరాలు ఇలా ఉన్నాయి. బొగ్గిడివారిపల్లి గ్రామ పంచాయతీ వడ్డివారిపల్లెలో సుమారు వంద కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. పూర్వం నుంచి గ్రామం నుంచి కలవానికుంటకు మార్గం ఉందన్నారు. అదే గ్రామానికి చెందిన కుప్పాల వెంకటసుబ్బయ్య అతని భార్య సరిత అధికారులను మోసగించి తప్పుడు పత్రాలతో రోడ్డును కబ్జా చేశారన్నారు. కబ్జా చేయడమే కాక రోడ్డు స్థలం వారసత్వంగా సంక్రమించిందని అధికారులకు తెలుపుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని పూర్తిస్థాయిలో విచారించి రోడ్డును గ్రామానికి అప్పగించి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మూతపడ్డ ఏపీఎండీసీ వాటర్ ప్లాంట్



తల్లెంవారిపల్లెలో నిరుపయోగంగా ఉన్న వాటర్ ప్లాంట్

ఓబులవారిపల్లె : తల్లెంవారిపల్లెలో ఏపీఎండీసీ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా ఉంది. సమీప గ్రామాల ప్రజలకు ఏపీఎండీసీ ఫౌండేషన్ ద్వారా ఆర్‌ఓ వాటర్ అందించాలనే లక్ష్యంతో తల్లెంవారిపల్లె గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గత కొంత కాలంగా వాటర్ ప్లాంట్ పని చేయకపోగా ఫౌండేషన్ వారు పట్టించుకోక పోవడంతో మూతపడింది. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంజూరైంది. దాదాపు 300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గ్రామస్తులకు ఎంతో ఉపయోగపడే ఆర్‌ఓ ప్లాంట్‌కు మరమ్మతులు జరిపి తాగునీరు అందించాలని అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు.

మార్చి 9న లోక్ అదాలత్

వాల్మీకిపురం: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కక్షిదారులు రాజీ మార్గం ద్వారా వారి కేసులను పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అని తెలిపారు. కేసులు ప్రీ సిట్టింగ్స్‌లోనూ రాజీ చేసుకోవచ్చునని తెలిపారు.